# ప్రాణాంతకం



ఉదయం ఎనిమిదిగంటల కల్లా జ్యోతి పిల్లలిద్దర్నీ స్కూలుకు తయారుచేసి పంపుతూనే ఇళ్లల్లో పని చెయ్యటానికి బయల్దేరింది. పంచలో మంచం మీద పడి నిద్రపోతున్న సత్యం ఇంకా నిద్రలేవలేదు. రాత్రివేళ గనుక పొద్దు పోయేదాకా ఆటో బాడుగలకు తిరిగొస్తే కాస్త ఆలస్యంగా నిద్రలేస్తాడు.

ఐతే రాత్రి ఇంటికొస్తూనే, స్నానం చేసే ఓపిక కూడా లేదంటూనే మంచానికడ్డం పడ్డాడు. కాస్త అన్న పెడతానంటే ఆకలి లేదంటూ దుప్పటి ముసుగుతన్ని పడుకున్నాడు. పది రోజులబట్టి మనిషి కొంచెం నలతగానే కనబడుతున్నాడు. జ్వరంగా వుందని ఏవో మందుబిళ్లలు కూడా తెచ్చుకొని వేసుకొన్నట్లు గుర్తొచ్చింది జ్యోతికి. పన్లోకి వెళ్లబోతున్నదల్లా ఒకవేళ ఒంట్లోగాని బాగోలేక లేవలేదేమో అన్న అనుమానం కలిగింది.

"సత్యం బావా! సత్యం బావా!" అంటూ పిలుస్తూ మనిషిని తట్టి లేపే ప్రయత్నం చేసింది. చేతులకు సత్యం వంటి వెచ్చదనం సెగలా తగిలింది. పెనంలా వళ్ళు కాలిపోతున్నట్లనిపించింది. వంట్లో బాగోలేకనే లేవలేదన్న సంగతి అర్థమైంది.

జ్యోతి కేకలకు కళ్లు తెరిచే ప్రయత్నం చేశాడు గాని కళ్లు సరిగా తెరిపిడ్లుపడటం లేదు. తలనొప్పి విపరీతంగా వున్నట్లుంది. మెల్లగా లేపి కూచోబెట్టే ప్రయత్నం చేసింది కాని మనిషి లేవగలిగే పరిస్థితి కనిపించలేదు. కాస్త ఆయాసపడుతున్నాడు. ఒక్కసారి బొళుక్కు మని వాంతి చేసుకున్నాడు. మళ్లీ తోటకూర కాడలా వేలాడబడి మంచం మీదకు జారిపోయాడు.

జ్వరం మీదున్న మనిషిని ఇంట్లో వదిలి పన్లోకి ఎలా వెళ్లగలదు? అటుగా పన్లోకి వెళ్తున్న సీతమ్మను పిలిచింది. "ఈ రోజు సత్యానికి ఒంట్లో బాగుండలేదు సీతక్కా! ఇయ్యాల పన్లోకి రాలేనని సుభద్రమ్మగారికి, సరస్వతమ్మగారికి కాస్త చెప్పు" అంటూ కబురు పెట్టింది. ఏం చెయ్యాలో తోచలేదు. కలవరపాటుతో కాళ్లూ చేతులాడటం లేదు.

జ్యోతి పబ్లిక్ కాయిన్ బాక్స్ నుంచి తమ్ముడు శీనుకి ఫోన్ చేసి విషయం చెప్పింది. ఉన్నపళంగా వెంటనే బయల్దేరి రమ్మంది.

అర్థగంటలో శీను ఆటో వేసుకొని వచ్చాడు. అతనూ ఆటోడ్రైవరే!

కదలలేని పరిస్థితిలో వున్న సత్యాన్ని కష్టం మీద మోసుకెళ్లి ఆటోలో కూచోబెట్టారు. దగ్గర్లో వున్న ఒక నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్లారు. డాక్టర్ సతీష్ పిల్లల్ని రోజూ ఆటోలో తీసుకెళ్లి తీసుకొస్తుంటాడు శీను.

డాక్టర్ సతీష్ పేషెంట్ కండిషన్ చూశాడు. జ్వరం తీవ్రత బాగుంది. పల్స్‌రేట్ కాస్త తక్కువగా వుంది. మాట్లాడగలిగే పరిస్థితిలో లేడు మనిషి. కళ్లల్లో కొంచెం పచ్చదనం కనిపిస్తోంది.

"మీ ఆయనకు జ్వరం ఎప్పుడ్నుంచి?" ప్రశ్నించాడు.

"పదిరోజుల బట్టి వున్నట్టుందండీ!"

"ఎవరన్నా డాక్టర్‌కి చూపించి మందులు గాని వాడారా"?

"లేదండీ! ఎక్కడో మందుల షాపు వాళ్లనడిగి బిళ్లలు తెచ్చుకొని వేసుకొన్నట్టున్నాడు. తగ్గినట్లే తగ్గి మళ్లీ తిరగబెట్టినట్టుందండి" నసుగుతూ చెప్పింది జ్యోతి.

డాక్టర్ సతీష్‌కి విషయం అర్థమైంది.

కొందరు పేషెంట్లు చేసే తెలివితక్కువ పనుల వల్ల ఎలాంటి విషమ పరిస్థితుల్లో పడతారో ఆయనకు తెలియంది కాదు. దానిని అజ్ఞానమనుకోవాలో, నిర్లక్ష్యం అనుకోవాలో తెలియదు.

నర్స్‌తో పేషెంట్‌కు సెలైన్ పెట్టమని చెప్పి బ్లడ్ శాంపిల్ తీసి, ఏవేం రక్తపరీక్షలు చేయించాలో రాసిచ్చాడు. ప్రాథమిక చికిత్సగా తక్షణం చెయ్యాల్సిన ఇంజక్షన్ కూడా నర్స్‌కు చెప్పాడు.

"డేంజర్ ఏం లేదుగా సార్!" డాక్టర్ గారితో వున్న పరిచయాన్ని బట్టి చొరవచేసి అడిగాడు శీను.

"కేస్ స్టడీ చెయ్యకుండా అప్పుడే ఎలా చెప్పగలనయ్యా! బ్లడ్ రిపోర్ట్‌లు రావాలి. ఏం చెయ్యాలన్నా, అసలు జ్వరం వస్తున్న కారణం తెలియాలి. బాగా అశ్రద్ధచేశారు. చేతులారా చేసుకోవటం అంటారు చూడు అలాంటిది ఇది" అంటూ ఉన్న విషయం చెప్పాడు డాక్టర్ సతీష్.

డాక్టర్ మాటలకు జ్యోతి, శీను బాగా కలవరపడ్డారు. వ్యాధిని బాగా ముదర బెట్టుకొని వచ్చినట్లు గ్రహించగలిగారు. అంతా పైవాడి దయ, తమ అదృష్టమనుకొంది జ్యోతి. ఇన్వెస్టిగేషన్లకు అవసరమైన డబ్బు చెల్లించి బెడ్ దగ్గరే కూర్చొంది దీనంగా.

గంట తర్వాత బ్లడ్ రిపోర్టులు వచ్చాయి.

ప్లాస్మోడియం వైవేక్స్ కారణంగా వచ్చిన మలేరియా జ్వరంగా తేలింది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా వుంది. జాండిస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. అనుమానం వచ్చి పేషెంట్ స్ప్లీన్, లివర్ పరీక్షించాడు. రెండూ ఎన్‌లార్జ్ అయినట్లు గ్రహించాడు. మందు బిళ్లల వలన వ్యాధి సప్రెస్ అయి పేషంట్‌ను తప్పుదారి పట్టించింది. ఇంటర్నల్ ఆర్గాన్స్ డామేజి మొదలైందని అర్థంచేసుకొన్నాడు. ఇంకా రీనల్ కాంప్లికేషన్స్ ఏమీ కనిపించక పోవటం రిలీఫ్‌గా అనిపించింది.

డాక్టర్ సతీష్ తొందరగానే పేషెంట్ కండిషన్ పట్ల ఒక అవగాహనకు రాగలిగాడు. అసలు వ్యాధిని గుర్తించటం గాని, తగిన చికిత్సగాని సకాలంలో జరగకపోతే వచ్చే కాంప్లికేషన్లే ఇవన్నీ. పేషెంట్ ఆరోగ్యాన్ని దారిలో పెట్టటానికి చెయ్యవలసిన చికిత్స ఏంటో అతనికి బాగా తెలుసు. మలేరియా మందులతో పాటు స్ప్లీన్, లివర్ కండిషన్ మెరుగుపడటానికి అవసరమైన మందులు ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు.

కావలిసిన మందులన్నీ తీసుకునేసరికి చేతిలో వున్న డబ్బు కాస్తా అయిపోయింది. మందులు తెచ్చిస్తూనే ట్రీట్‌మెంట్ మొదలెట్టారు. ఇంకా అవసరమైన డబ్బు గురించే సమస్యంతా!

"అక్కా! నా దగ్గర డబ్బులు అయిపోయాయి. ఇంకా ఏవేం మందులు కొనాలో, ఇక్కడ ఎన్నాళ్లుండాలో, ఎంత ఖర్చువుతుందో చెప్పలేం. ఇంట్లో డబ్బేమైనా వుందా?" అడిగాడు శీను.

"వందో, రెండొందలో తప్ప పెద్ద మొత్తంలో ఎక్కడుంటాయిరా! పిల్లలిద్దరికీ మొన్నే ఫీజులు మూడేల దాకా కట్టాం. ఆటో లోను కిస్తీ కూడా కట్టాల్సొచ్చి కటకటపడ్డాం. మా యమ్మగార్ల నడిగితే ఎంతో కొంతిస్తారు. ఆపైన ఇంకా కావాల్సివత్తే వడ్డీకి అప్పుతెచ్చుకోవాల్సిందే." అసలు విషయం చెప్పింది జ్యోతి.

రెండ్రోజులపాటు సత్యం ఆరోగ్య పరిస్థితి గురించి ఆందోళన పడాల్సొచ్చింది. బాగా తలనొప్పి, జ్వరం, వాంతులు మనిషిని ఇబ్బంది పెట్టాయి. ఆహారం తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. మందులకనీ, టెస్ట్‌లకనీ డబ్బు ఖర్చువుతూనే వుంది.

జ్యోతి పనిచేస్తున్న ఇళ్ల వాళ్లను అడిగితే చెరో వెయ్యి ఇచ్చారు. ఆటో కాగితాలు తనఖాపెట్టి అవసరానికి తెచ్చి సర్దటానికి శీను తగిన ఏర్పాట్లు చేశాడు. రోజూ నిద్రహారాలు లేకుండా ఇంటికీ ఆసుపత్రికి పరుగులు పెడుతూనే వుంది పాపం జ్యోతి.

నాలుగురోజులకు సత్యం కోలుకోగలిగాడు. అది జ్యోతిని సంతోషపెట్టే అంశమే అయినా అప్పుల్లో మునిగితేలటం ఆందోళనకు గురిచేసే మరో అంశం. ఇలాంటి విషమ పరిస్థితుల్లో అయ్యే ఖర్చులను సర్దుబాటు చేసుకోటానికి కొంతకాలం బండచాకిరీ తప్పదు. సాదా సీదా జనాన్ని అప్పుల పాలు చెయ్యటానికి ఈ మాత్రపు అనారోగ్యాలు చాలు.

డాక్టర్ ఇడ్లీ తినిపించమన్నాడు. ఆకలి కూడా తెలియటంతో మెల్లగా తినగలిగాడు. కాస్త ఓపిక వచ్చినట్లయి మాట్లాడగలుగుతున్నాడు.

"ఏవయ్యా! సమయానికి ఇక్కడకు తీసుకువచ్చారు గనుక సరిపోయింది. మరికాస్త అశ్రద్ధ గనుక చేసుంటే మా చేతుల్లో ఏముండేది కాదు. మందుల షాపుల్లో మందులమ్మే చిల్లర మల్లర వ్యాపారులు రోగాలు నయం చేసే డాక్టర్లనుకొంటే ఎలాగయ్యా?" అంటూ చురకంటించాడు డాక్టర్.

సత్యం దోషిలా తలొంచుకొన్నాడు. తన తెలివి తక్కువతనానికి ఇంతటి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనుకోలేదు. కాస్త జ్వరానికే కంగారు పడి డాక్టర్ దాకా ఎందుకు లెమ్మనుకొన్నాడు గాని చేజేతులా ప్రాణాల మీదకి తెచ్చుకోవటమవుతుం దనుకోలేదు.

కొద్ది రోజుల క్రితం జ్వరం, తలనొప్పి, చలిచలిగా వున్నట్లనిపించింది. ఆ ముందురోజు కాస్త వర్షంలో తడిసినందువల్ల కామోసని అంతగా పట్టించుకోలేదు. డాక్టర్ దగ్గరకెళ్తే ఫీజు, పరీక్షలంటూ వందలు ఖర్చవుతుందని కక్కుర్తి పడ్డాడు. మందుల షాపతనితో జ్వరం, తలనొప్పిగా వుందని చెప్తే యాభైరూపాయలు తీసుకొని రెండ్రోజులపాటు వేసుకొమ్మని మందులేవో ఇచ్చాడు. చెప్పినట్లు వేసుకొన్నాడు. జ్వరం తగ్గేసరికి మందుల మీద గురి కుదిరింది. అదే ఏ డాక్టర్ దగ్గరకోవెళ్తే తడిసి మోపెడయ్యేదని సంతోషించాడు.

రెండ్రోజులు బాగానే వుందనిపించింది. ఆకలి మందగించటం, నీరసంగా వుంటున్నా జ్వరం వచ్చిన మీదట నాల్రోజులు అలానే వుండొచ్చనుకున్నాడు. పని మానితే రోజుకు నాలుగైదొందలు ఆదాయం పోతుందని మొండికిబడి తిరిగాడు. మళ్లీ ఒకరోజు వున్నట్లుండి జ్వరం, తలనొప్పి, ఏవన్నా తింటే సహించక వాంతవు తున్నట్లనిపించి మళ్లీ ఆ మందులషాపతని దగ్గిరికే వెళ్లాడు. పవర్‌పెంచి ఇస్తున్నానంటూ వందరూపాయలు తీసుకొని రెండ్రోజులకు సరిపడా మళ్లీ మందులిచ్చాడు. నీరసంగుందంటే బలానికని బిళ్లలిచ్చాడు. వేసుకొంటే బాగానే వుందనిపించింది. రెండ్రోజులపాటు పెళ్లి ముహూర్తాలకు ఎడాపెడా బాదుగులు తోలి వెయ్యి రూపాయలకు పైగా కళ్ల జూడగలిగాడు. ఐతే జ్వరం ఒక్కసారిగా తిరగబెట్టి రాత్రికి రాత్రే మంచాన పడేసింది.

డాక్టర్ పుణ్యమా అని బ్రతికి బట్టకట్టగలిగాననుకొన్నాడు. ఇదంతా స్వయం కృతాపరాధమనే ఆయన మాటల వల్ల గ్రహించగలిగాడు. గండమైతే గడిచిందిగాని ఆసుపత్రి ఖర్చులకైన అప్పు, పనిదినాలు నష్టపోవటాన్ని ఏరకంగా పూరించు కోగలడు?

"సత్యం! జ్వరమనేది దానంతటది ఒక రోగం కాదు. ఒక రోగలక్షణం మాత్రమే. దానికి కారణం ఏమిటనేది పరీక్షల ద్వారా నిర్ధారించి తగిన చికిత్స చెయ్యగలుగుతాడు డాక్టర్. నీకు జ్వరం వచ్చినప్పుడు వైద్యానికి మందుల షాపుకు వెళ్లకుండా ఏ క్వాలిఫైడ్ డాక్టర్ దగ్గరకు వెళ్లినా ఇదే చికిత్స సకాలంలో జరిగి నీ జబ్బు సులభంగా నయమయ్యేది. ఏ రోగానికైనా, సకాలంలో సరైన చికిత్స గనుక జరగకపోతే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం కూడా వుంటుంది. ఈ విషయం గురించి సరైన అవగాహన లేని నీలాంటి అమాయకులు ఎందరో ఇలాంటి మెడికల్ షాపు వైద్యాలతో అటు ఆర్థికంగా ఇటు ఆరోగ్యపరంగా ఎంతో నష్టపోతారు. కొందరికి కొన్ని మందులు సరిపడవు. ఒక్కోసారి అలాంటి సరిపడని మందులు వాడినందువలన రియాక్షన్లు వచ్చి ప్రాణాపాయం సంభవించవచ్చు. వాటి గురించిన అవగాహన డాక్టర్లకున్నంతగా షాపులవాళ్ల కుండదు. ఇకముందైనా అనారోగ్యం వస్తే ఇలాంటి పిచ్చి పనులు చెయ్యటం మాని తగిన వైద్యుడికి చూపించుకోండి" హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసి పంపుతూ ఓపికగా చెప్పాడు డాక్టర్ సతీష్.

ఆ తర్వాత జీవితంలో సత్యం అలాంటి పొరపాటు మరెన్నడూ తను చెయ్యకుండా వుండటమే కాదు, తనకు తెలిసిన వాళ్లెవరూ అలాంటి పొరపాటు చెయ్యకుండా చూశాడు.

❋

*(రచనా కాలం, ఆగస్టు 2011)*